క్లుప్తంగా

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బొండపల్లి: దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అర్చకులు దూసి శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుగ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే నిత్యన్నదాన కార్యక్రమంలో భాగంగా ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ చేశారు.

సంచార జాతుల అభివృద్ధికి కృషి


సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియామకపత్రం స్వీకరిస్తున్న త్రినాధరావు

కొత్తవలస: సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర ఉపాధ్యాక్షుడిగా మండలంలోని మునగపాకవానిపాలెం గ్రామానికి చెందిన ఎం.త్రినాధరావు నియ మితులయ్యారు. సోమవారం సాయంత్రం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు నియామకప్రత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు అందజేశారు. త్రినాధరావు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 36 సంచార జాతుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. తనకు ఈ బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతల తెలిపారు.

శరవేగంగా వాణిజ్య సముదాయ నిర్మాణం

- రూ.78 లక్షలతో 14 దుకాణాల నిర్మాణం


గోడల దశలో దుకాణాల నిర్మాణం

కొత్తవలస: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ వారపు సంత స్థలాన్ని ఆనుకుని కె.కోటపాడు రోడ్డులో నిర్మిస్తున్న వాణిజ్య సముదాయం పను లు శరవేగంగా సాగుతున్నాయి. వాణిజ్య సముదాయం పనులు పునాదులు దాటి ఫిల్లర్ల స్టేజ్‌లో ఉన్నాయి. రూ.78 లక్షల అంచనా వ్యయం తో 14 దుకాణాలను నిర్మిస్తున్నట్లు పంచాయతీరాజ్ డీఈ సీహెచ్.స్వామినాయుడు తెలిపారు. ఈదుకాణాలను అద్దెలకు ఇచ్చేందుకు ఔత్సాహి కుల నుంచి రూ.40 లక్షలు డిపాజిట్ల రూపంలో వచ్చాయని ఆయన చెప్పారు. మూడు నెలల్లో నిర్మాణ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు.

వైద్యసేవల వివరాలను ఆన్‌లైన్ చేయాలి


యాప్‌లపై అవగాహన కల్పిస్తున్న పోగ్రాం అధికారి మోహన్‌రావు

బొండపల్లి: వైద్య సిబ్బంది తాము నిర్వహించే సేవల వివరాలన్నీ ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేయాల ని జిల్లా పోగ్రాం అధికారి మోహన్‌రావు సూచించారు. మొబైల్ అకాడమీ, కిలారి యాప్‌ల వినియోగం, సేవలను ఆన్‌లైన్ చేసే విధానం పై దేవుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ రోగులను గుర్తించడం, వారికి అందించే సేవలతో పాటు మందుల వివరాలన్నీ ఈయాప్‌ల్లోనే నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. వైద్యాధికారులు ఝాన్సీ, సత్యవతి, సూపర్‌వైజర్ బి.నారాయణప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సారిపల్లిలో పైడిమాంబ ఉత్సవాలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సారిపల్లి గ్రామంలో శ్రీపైడితల్లమ్మ ఉత్సవాలను గ్రామస్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. విజయనగరం శ్రీపైడిమాంబ ఉత్సవాల సమయంలో గ్రామంలో కూడా అమ్మవారికి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామస్తులు తెలిపారు. మహిళలు ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పైడితల్లి పండగ సందర్భంగా ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

ఊరిలోనే సూపర్ స్పెషాలటీ వైద్యం

దత్తిరాజేరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపుల ద్వారా ప్రజలకు గ్రామాల్లోనే సూపర్ స్పెషా లటీ వైద్యసేవలు అందుతున్నాయని ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని పోరలి గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని సర్పంచ్ మిత్తిరెడ్డి ధనలక్ష్మి, వైస్ ఎంపీపీ రమేష్‌తో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో వైద్యులు బీపీ, షుగర్,రక్త పరీక్షలతో పాటు ఖరీదైన ఈసీజీ పరీక్షలు కూడా ఉచితంగా చేస్తున్నట్లు పేర్కొన్నారు. శస్త్రచికి త్స లు, మెరుగైన వైద్యసేవలు అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేసి వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అవసరమైన వారికి మందుల కిట్లు, వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా నేత్రశస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు, సచివాలయ కన్వీనర్లు సిరిపురపు శంకరరావు, పాపారావు పాల్గొన్నారు.


కొత్తవలస: రాజుపాత్రునిపాలెం వైద్యశిబిరంలో మాట్లాడుతున్న వెలమ కార్పొరేషన్ చైర్మన్ నాయుడుబాబు

కొత్తవలస మండలంలో ముగిసిన శిబిరాలు

కొత్తవలస: మండలంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు మంగళవారంతో ముగిశాయి. ఆఖరిరోజు రాజుపాత్రునిపాలెం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 414 మందికి వైద్యులు వివిధ తనిఖీలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శిబి రాన్ని రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీడాక్టర్, జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాల ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోన్‌రెడ్డి ప్రజలకు వైద్యసేవలను చేరువ చేశారు. ప్రజారోగ్య రక్షణ కోసం ఖర్చుకు వెనుకాడడం లేదన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం ఇంటిముందరే అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, వైస్ ఎంపీపీ కర్రి శ్రీను,సర్పంచ్ ఎం.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.


దత్తిరాజేరు: పోరలిలో వృద్ధుడికి కళ్లద్దాలు అందజేస్తున్న ఎంపీపీ సింహాద్రిఅప్పలనాయుడు, నాయకులు

ఇందిరమ్మకు ఘన నివాళి

శృంగవరపుకోట: దివంగత ప్రధానమంత్రి ఇందిరా గాంధీ వర్ధంతిని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక సుబ్బ రామిరెడ్డి కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.బంగారునాయుడు మాట్లాడుతూ గరీబీ హటావో నినాదంతో దేశ వ్యాప్తంగా కోట్లాది కుటుంబాల ఆర్థిక ఎదుగుదలకు ఊతమిచ్చిన మహిళా మూర్తిగా, బ్యాంకుల జాతీయకరణ, భూసంస్కరణల అమలు వంటి సాహసోపేత నిర్ణయాలతో ప్రపంచ పటంలో భారత్‌ను ఒక శక్తిగా నిలపడంలో ఇందిరమ్మ పాత్ర తిరుగులేనిది అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యులు హెచ్.నానాజీ, పదాల మణిబాబు, అచ్చిబాబు, అప్పారావు, పూడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేడు ప్రభుత్వ భవనాల ప్రారంభం

గుర్ల: మండలంలోని గుజ్జింగివలస గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను బుధవారం ప్రారంభించనున్నట్లు ఆగ్రామ సర్పంచ్ రెడ్డి పద్మావతి మంగళవారం తెలిపారు. అతిథులుగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక సచివాలయ సిబ్బంది, ప్రజలు హాజరు కావాలని కోరారు.

'నామట్టి-నాదేశం'లో ఏపీఓ శేఖర్


నామట్టి- నాదేశం కార్యక్రమంలో పాల్గొన్న ఏపీఓ శేఖర్ (మధ్యలో ఉన్న వ్యక్తి)

జామి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీలో నిర్వహించిన నామట్టి-నాదేశం కార్యక్రమానికి మండలం నుంచి ఉపాధిహామీ పథకం ఏపీఓ శేఖర్ హాజరయ్యారు. మండలంలో అన్ని గ్రామాల నుంచి మట్టిని సేకరించి ఢిల్లీకి తీసుకుని వెళ్లారు.

జాతీయ ఐక్యతా దినోత్సవం

శృంగవరపుకోట: భారతదేశ తొలి ఉపప్రధాని స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ యూనిట్ల నేతృత్వంలో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.కేశవరావు మాట్లాడుతూ భారతదేశ సమగ్రత, సమైక్య తకు పాటుపడిన మహనీ యుడు వల్లభాయ్‌పటేల్ అని వివరించారు. భిన్నజాతులు, మతాలు, సంస్కృతులు, సంప్రదాయాలు ఉన్న అద్భుతమైన సమా హారం మనదేశం అని చెప్పారు. అటువంటి దేశ సమగ్రతను చాటేందుకు, మన తర్వాత తరాలకు వివరించేందుకు దేశచరిత్రపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓ జి.ఈరన్న మాట్లాడుతూ సంస్థా నాల విలీనంలో, దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ పాత్రను వివరించారు. అధ్యాపకులు వాసు దేవరావు, వలీఖాన్, భాస్కర్, సుధీర్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.


జాతీయ ఐక్యతా దినోత్సవ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

ఉత్సవంలో అగ్నిమాపక సేవలు భేష్

విజయనగరం క్రైమ్: సిరిమానోత్సవంలో అగ్నిమాపక శాఖ అధికారులు ఆస్కా లైట్లను సకాలంలో అందుబాటులోకి తీసుకొచ్చారు. సిరిమాను రెండో సారి తిరిగే సమయానికి లైట్లను వెలిగించారు. విద్యుత్ లైన్లను ఎక్కడికక్కడ నిలుపుదల చేయడంతో పరిసర ప్రాంతాలలో ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అగ్నిమాపక శాఖ అధికారులు ఏర్పాట్లు చేయడంలో సఫలీకృతులయ్యారు. జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి రామ్‌ప్రకాష్, పట్టణ అగ్నిమాపక అధికారి సోమేశ్వరరావు పర్యవేక్షణలో నాలుగు అగ్నిమాపక కేంద్రాల నుంచి స్టేషన్ ఫైర్ అధికారులు, సిబ్బంది సేవలందించారు.

కాలువల్లో వ్యర్థాల తొలగింపు

శృంగవరపుకోట: పట్టణంలోని పెదఖండేపల్లి రోడ్డులో మహ్మదీయుల గోరీ వద్ద, గొల్లవీధిలో కొన్ని నెలల క్రితం రియల్టర్ చేసిన పనుల కారణంగా భవన నిర్మాణ సామగ్రిని మురుగు నీరు పారే కాలువలో వేయటం వల్ల కాలువలు పూడుకుపోయాయి. మరుగునీరు పారే అవకాశం లేక, దోమల బెడద ఎక్కువయ్యింది. కాలువలు శుభ్రం చేయించడంతో పాటు ఊరి మధ్యలో ఉన్న గొర్రెల మందలను ఊరి బయటికి తరలించాలని వైద్యాధికారి, తహసీల్దార్, పంచాయతీ ఈఓలకు స్థానికులు ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదులపై స్పందించని పక్షంలో కోర్టులో ప్రజాప్రయోజన వాజ్యం దాఖలు చేసేందుకు తాము సిద్ధమని స్థానికులు తెలిపారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన పంచాయతీ ఈఓ కన్నబాబు గత రెండు రోజులుగా పారిశుద్ధ్య కార్మికులతో పనులు చేయించి కాలువల్లో అనుమతులు లేకుండా ఉన్న పైపులు, రాళ్లు మట్టి తీయించారు. గొర్రెల పెంటలు, మందలను తరలించాల్సి ఉంది. తమ ఫిర్యాదుపై స్పందించి నందుకు అధికారులకు ఫిర్యాదుదారులు ధన్యవాదాలు తెలిపారు.


పెదఖండేపల్లి రోడ్డు వద్ద కాలువలో వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కరుణించని వరుణుడు


బొండపల్లి: తమటాడ గ్రామంలో ఎండిపోతున్న వరిపైరు

శృంగవరపుకోట/ లక్కవరపుకోట: చినుకు జాడ లేక నియోజకవర్గంలో వరి చేలు ఎండిపోతున్నాయి. చెరువులు ఇంకిపోతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు ఓ మోస్తారుగా కురవడంతో నియోజకవర్గవ్యాప్తంగా బోర్లు, బావులు, చెరువులు ఆధారంగా రైతులు వరినాట్లు వేశారు. ఆతర్వాత ఆశించిన స్థాయిలో వర్షాలు కురవ కపోవడంతో పంటను కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రస్తుతం వరిచేను పొట్టదశకు చేరుకుంది. లక్కవరపుకోట మండలంలోని శ్రీరాంపురం, కళ్లేపల్లి, తామరాపల్లి, రేగ, లచ్చింపేట, పోతంపేట, చందులూరు,మార్లాపల్లి, లింగంపేట తదితర గ్రామాల్లో వరి పంట ఎండిపోయే స్థితికి చేరుకుంది. చివరి దశలో వరిపైరు పండి,పంట చేతికి దక్కడానికి ఒక్క వర్షం చాలంటూ చినుకు కోసం ఆకాశం కేసి ఆశగా ఎదురుచూస్తున్నారు. పలుగ్రామాల్లో నీటి వనరులు ఉన్న చోట రైతులు చెరువులు, గెడ్డల్లోని నీటిని మోటార్లు, ఇంజిన్లతో తోడి పంటకు అందిస్తున్నారు. ఎండిపోతున్న పంటను కాపాడుకునే పద్ధతులపై గ్రామాల్లో వ్యవసాయ సహాయకులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. 2 కిలోల మల్టీకే (13-0-45) ఫౌడర్‌ను 20 ట్యాంక్‌ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారి చేయాలని, ఇలా చేయడం వల్ల 15 రోజుల వరకు వర్షాభావ పరిస్థితిని తట్టుకుని పంట నిలబడుతుందని ఏఓ ఎస్.స్వాతికుమారి తెలిపారు.

200 ఎకరాల్లో దెబ్బతిన్న పంట

బొండపల్లి/గజపతినగరం: నెల రోజులుగా వర్షాలు లేకపోవడంతో వరి పైర్లు ఎండి పోయే స్థితికి చేరుకున్నాయి. బొండపల్లి,గజపతినగరం మండలంలోని చాలా గ్రామాల్లో మెట్టు ప్రాంతాల్లో సాగు చేసిన వరి పంట నీటిఎద్దడి కారణంగా ఎండిపోయింది. నీటి వనరులున్న చోట రైతులు ఆయిల్ ఇంజిన్లతో పంటకు నీటితడులు అందించి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. బొండపల్లి మండల వ్యాప్తంగా సుమారు 200 ఎకరాల్లో పంట ఎండిపోయే దశలో ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. గజపతినగరం మండలంలోని బంగారమ్మపేట,భూదేవిపేట,తుమికాపల్లి,మరుపల్లి,మధుపాడ,పాతబగ్గాం తదితర గ్రామాల్లో పంట ఎండిపోతోంది. పలువురు రైతులు చెరువులు,గెడ్డల్లో ఉన్న కొద్దిపాటి నీటిని ఆయిల్ ఇంజిన్ల ద్వారా చేలకు అందించి కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.


శృంగవరపుకోట: వేపాడలో మోటార్లు వేసి నీరు తోడడంతో ఎండిపోయిన బంద


లక్కవరపుకోట: లచ్చింపేటలో వర్షాభావ పరిస్థితి కారణంగా ఎండిపోతున్న వరి పంట


గజపతినగరం: మధుపాడలో చెరువు నీటిని ఇంజిన్ ద్వారా వరిపంటకు అందిస్తున్న రైతులు

సిరిమాను సంబరం


ఆలయ ప్రాంతంలో జన సందోహం

ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం వైభవంగా సాగింది. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికార యంత్రాంగం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంది. మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఎం.దీపిక, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, పులివేషాలు, తప్పెటగుళ్లు, బాణసంచా, విశేష వేషధారణలతో నగరంలో సందడి నెలకొంది.

– సాక్షి, విజయనగరం


రాజీవ్ క్రీడా మైదానంలో బాణసంచాను తిలకిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు


ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఎం.దీపిక


సిరిమానోత్సవాన్ని తిలకిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ సురేష్‌బాబు


కోట వద్ద పులివేషాల పోటీలు


అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు


బాణసంచా వెలుగులు


అమ్మవారి పాలధార పట్టుకు వెళ్తున్న పూజారి


తప్పెటగుళ్ల విన్యాసం

భక్తుల సేవలో స్వచ్ఛంద సంస్థలు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి సిరిమాను జాతరను తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పలు స్వచ్ఛంద సంస్థలు, పోలీస్ సేవాదళ్ సభ్యులు సేవలందించారు. ఉదయం నుంచి క్యూలో బారులుతీరిన భక్తులకు 'నా ఊరు విజయనగరం' స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఈశ్వర్ కౌశిక్ మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు, బిర్యానీ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కొడువగంటి వారి వీధిలో భక్తులకు న్యాయవాది బొడ్డు సత్యనారాయణ బిర్యానీ, స్వీట్ పొంగల్‌ను అందజేశారు.


వృద్ధురాలిని వీల్‌చైర్‌లో ఆలయం వద్దకు తీసుకువస్తున్న ఎన్‌వీవీ వలంటీర్ విశాలి

పైడితల్లి జాతరలో కార్పొరేషన్ యంత్రాంగం

విజయనగరం: మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించిన విజయనగరం ఉత్సవాలు, పైడితల్లమ్మవారి జాతర మహోత్సవంలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం సంతృప్తికర సేవలందించింది. ఉత్సవాల నిర్వహణలో కీలకమైన పారిశుద్ధ్య నిర్వహణపై కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు ప్రత్యేక దృష్టి సారించారు. అదనంగా తాత్కాలిక సిబ్బందిని నియమించి అమ్మవారి ఆలయ పరిసరాలతో పాటు 13 వేదికల్లో నిర్వహించిన ఉత్సవాల వద్ద నిరంతర పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. మంగళవారం జరిగిన అమ్మవారి సిరిమానోత్సవంలో భాగంగా సిరిమానుకు భక్తులు సమర్పించే పసుపు, కుంకుమ, అరటిపళ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయటంతో పాటు వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పిచికారి చేశారు. అదేవిధంగా కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సహకారంతో నగరంలోని 20 ప్రాంతాల్లో ఉచిత మంచి నీటి సరఫరా కేంద్రాలను ఏర్పాటు చేసి నగరానికి వచ్చిన భక్తులకు, సందర్శకులకు తాగునీరు అందించారు. రూ.2.75 లక్షలు వెచ్చించి 24 ప్రాంతాల్లో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. అందరి సమన్వయంతో విజయనగరం ఉత్సవాలు, అమ్మవారి జాతర మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించామని కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు పేర్కొన్నారు. ఇందులో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు.


అమ్మవారి సిరిమాను సంబరంలో పారిశుద్ధ్య చర్యల్లో సిబ్బంది